క్లుప్తంగా

బీరువాల బహూకరణ



బీరువాలు అందిస్తున్న సుబ్బారావు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపల్ కార్యాలయానికి గొల్లపూడి సుబ్బారావు బుధవారం రెండు బీరువాలు బహూకరించారు. మాజీ సర్పంచ్ గొల్లపూడి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు అయిన సుబ్బారావు కమిషనర్ వై.రామకృష్ణయ్య సమక్షంలో బీరువాలు అందించారు. కార్యాలయ అవసరం నిమిత్తం బీరువాలను వినియోగించుకోవాలని కోరారు.

సర్పంచ్‌ని పరామర్శించిన ఎంపీపీ



సర్పంచ్‌ని పరామర్శిస్తున్న చీమకుర్తి ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: మండలంలోని నిప్పట్లపాడు గ్రామ సర్పంచ్ రావూరి కోటేశ్వరరావుకి త్రుటిలో ప్రమాదం తప్పింది. మరిచెట్లపాలెం నుంచి చీమకుర్తికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మార్గం మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. గాయాలపాలైన కోటేశ్వరరావును బుధవారం ఆయన నివాసంలో చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, బొడ్డు కోటేశ్వరరావు తదితరులు కలిసి పరామర్శించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: సమాజంలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు సూచించారు. బుధవారం చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు నేరాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, మత్తు పదార్థాల రవాణా, ఆకతాయిల గురించి అవగాహన కల్పించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రమాదకరమైన సంఘటనలు జరిగితే తక్షణమే తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలంటూ తన ఫోన్ నంబర్‌ను విద్యార్థినులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాస్వామి, టీచర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

250 మందికి అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం 27వ వారం ఎన్నారై వంకాయలపాటి ధ్రువ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో 250 మందికిపైగా అన్నదానం చేశారు. ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, చైర్మన్ సెనగల వెంకటరమణ పర్యవేక్షణలో ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, శీలం మల్లారెడ్డి, రాంకూరి జార్జ్, కూరపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

కియోస్క్‌లు కిల్..!

- ఆర్బీకేలలో మూలకు చేరిన కియోస్క్ మిషన్లు
- ఆర్బీకేలతో పాటు కియోస్క్‌ల సేవలను సైతం నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- వ్యవసాయశాఖలో డిజిటల్ ఆధారిత సేవలు నిల్
- అన్నదాతలకు అవస్థలు ఫుల్

ఒంగోలు సిటీ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆర్థికంగా ఆదుకుంది. రైతు సంక్షేమం అంటే ఎలా ఉంటుందో చేతల్లో చేసి చూపించింది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేసి రైతు వద్దకే అన్నిరకాల సేవలు అందించడం వారికి వరంలా మార్చింది. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కొరత తలెత్తకుండా నాణ్యమైన వాటిని ఎమ్మార్పీకే సరఫరా చేసింది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్‌లు ఏర్పాటుచేసి పంటలకు కావాల్సిన సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో తెలుసుకునేలా చేయడం రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. అయితే.. ప్రస్తుతం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలుగా రైతులను పూర్తిగా విస్మరించడంతో అన్నదాతల

> **సాంకేతిక సమస్యలతో కియోస్క్‌లు పనిచేయడం లేదు**
>
> 
>
> ఒంగోలు నియోజకవర్గంలోని కొన్ని కియోస్క్‌లు సాంకేతిక సమస్యల కారణంగా పనిచేయడం లేదు. పనిచేయని కియోస్క్‌ల గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – కిషోర్‌బాబు, ఏవో, ఒంగోలు



ఉలిచిలో పనిచేయని కియోస్క్

అవస్థలు అన్నీ ఇన్నీ కాకుండా ఉన్నాయి. ఆర్బీకేలకు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ.. సేవల కొనసాగింపులో మాత్రం కూటమి ప్రభుత్వం వివక్ష చూపింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముద్ర లేకుండా చేయడం కోసం ఆర్బీకేల సేవలకు స్వస్తి పలికింది. ఆర్బీకేల లక్ష్యం నీరుగారింది. వాటిలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్ల సేవలు సైతం నిలిచిపోయాయి. ఒంగోలు నియోజకవర్గంలో ఎక్కడా కియోస్క్‌లు పనిచేయకపోవడంతో రైతాంగం ఇబ్బంది పడుతోంది.

ఒంగోలు నియోజకవర్గంలోని 34 ఆర్బీకేలలోనూ నిలిచిపోయిన కియోస్క్‌ల సేవలు...

ఒంగోలు నియోజకవర్గంలో మొత్తం 34 ఆర్బీకేలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో ఆర్బీకేకి రూ.21.8 లక్షల చొప్పున మొత్తం రూ.7.41 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి ఆర్బీకేలో ఒక్కోటి చొప్పున 34 మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు ఏర్పాటు చేసింది. ఆర్బీకేలు, కియోస్క్‌ల ద్వారా ఒంగోలు నియోజకవర్గంలో మొత్తం 39,358 మంది రైతులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సేవలు పొందుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా సేవలన్నీ నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

కియోస్క్‌ల సేవలు ఇలా...

ఆర్బీకేల్లోని డిజిటల్ ఆధారిత సేవల ద్వారా మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లను సాంకేతికంగా రైతుల అవసరాలు తీర్చేందుకు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ రేటు, సమీపంలోని మార్కెట్ల వివరాలు, అక్కడి ధరలు డిస్‌ప్లే అయ్యేవి. వాటివలన రైతులకు కచ్చితమైన సమాచారం తెలిసేది. ముఖ్యంగా వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సీజన్‌లో ఏ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చు, తదితర సమాచారాలు లభించేవి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న కియోస్క్ సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం దూరం చేయడంపై రైతాంగం నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సాంకేతిక కారణాలతో కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. లక్షల విలువైన ఈ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల బాగున్నప్పటికీ.. ఇంటర్‌నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కియోస్క్‌లు, ఆర్బీకేల సేవలను రైతులకు దూరం చేసిందని, కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముద్ర ఉండకూడదని, రైతులకు వైఎస్ జగన్ చేసిన మేలు గుర్తుండకూడదని ఇలా చేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు సైతం కావాలనే పట్టించుకోకపోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్బీకేలు, కియోస్క్‌ల సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



పేర్నమిట్టలో ప్రతిజ్ఞ చేయిస్తున్న శిశు సంక్షేమ శాఖ పీడీ మాధురి



సంతనూతలపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

- స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా పీడీ మాధురి

సంతనూతలపాడు: బాల్య వివాహాలను నిర్మూలించాలని స్త్రీశిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కే మాధురి కోరారు. పేర్నమిట్టలోని కుమ్మరిపాలెం, శాంతినగర్, పేర్నమిట్ట 5వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లలంతా తప్పనిసరిగా విద్యనభ్యసించాలన్నారు. 18 సంవత్సరాల్లోపు బాలికలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహాలు చేయవద్దన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎన్నో వసతులు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. మొబైల్ వలన కలిగే నష్టాలు అధికంగా ఉంటాయన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నేరాలకు విద్యార్థులను దూరంగా ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు, గర్భిణులు, చిన్నారులు తీసుకోవడం ద్వారా వారి ఆరోగ్య సంరక్షణ కలుగుతుందన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం 13 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు తమ్మవరపు రమణమ్మ, దేవిలు స్టీల్ ప్లేట్లు, గ్లాస్లు పంపిణీ చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఫణిరాజ్‌కుమారి, సూపర్‌వైజర్ రామ, ఐటీసీ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటలక్ష్మి టీడీపీ నాయకుడు కరిచేటి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు హైస్కూల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.నాగలక్ష్మి, జి.పద్మావతి పర్యవేక్షించారు. బాల్యవివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని వారు సూచించారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను ఎంఈఓ వెంకారెడ్డి వివరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తల్లిదండ్రులను విద్యార్థులు చైతన్యపరచాలన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: మండలంలో బాల్యవివాహాలను అరికట్టాలని ఎంపీడీవో వి.జ్యోతి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం పలు అనర్థాలకు దారితీస్తోందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో బాల్య వివాహం జరుగుతుంటే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అందువలన తల్లిదండ్రులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లకు సూచించారు. ఆ మేరకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘుబాబు, ఏపీవో ధనంజయ, కార్యాలయ సిబ్బంది, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి



సంకువారిగుంటలో నిరసన వ్యక్తం చేస్తున్న విజయకుమార్, గ్రామస్తులు

సంకువారిగుంట (కొత్తపట్నం): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఆగంతుకులు, దుండగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామీణ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు దుగ్గిరాల విజయకుమార్ డిమాండ్ చేశారు. సంకువారిగుంట గ్రామంలో బుధవారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసం చేసిన ప్రాంతంలో మళ్లీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు, దళిత స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు, గ్రామస్తులు చెక్కా సురేంద్రనాథ్, తానికొండ కొండలరావు, సుధీర్ బాబు, చిటితోటి ఫణీంద్ర, చెక్కా నాగమణి, చిటితోటి కోమలి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అన్నదానం

చీమకుర్తి: రోటరీక్లబ్ అధ్యక్షుడు కడవ రామకృష్ణ ఆర్థిక సహకారంతో చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అన్నదానం చేశారు. కడవ వెంకట నర్సయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న రామకృష్ణ

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న శిద్దా సూర్యప్రకాష్‌రావు

సంతనూతలపాడు: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వీ205ఏ జిల్లాకు సంబంధించిన కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ తరఫున ఇద్దరు మహిళలకు బుధవారం కుట్టుమిషన్లు అందజేశారు. ఒంగోలులోని శిద్దాస్ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పారిశ్రామికవేత్త, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కోశాధికారి శిద్దా సూర్యప్రకాష్‌రావు, ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కొణిజేటి సురేష్, గార్లపాటి బ్రహ్మానందం చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ క్లబ్ వారు ఇచ్చిన టాస్కులు పూర్తిచేసిన 37 క్లబ్బులకు ఈ కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ పేర్ల సత్యనారాయణ తెలిపారు. సంతనూతలపాడుకు చెందిన కారంశెట్టి సుభాషిణి, షేక్ రసూల్‌బీలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయగా, వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, గ్రంధి లక్ష్మీప్రసాదరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, సెక్రటరీ చలువాది రాము, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, కోశాధికారి ఎన్. శ్రీలక్ష్మి, జిల్లా ఆర్యవైశ్య సంఘ జాయింట్ సెక్రటరీ చక్కా సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

30న పెన్షన్ల పంపిణీ

ఒంగోలు వన్‌టౌన్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఒక రోజు ముందుగా నవంబర్ 30వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టీ వసుంధర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2,86,034 మంది పెన్షన్‌దారులకు రూ.122 కోట్ల 22 లక్షల 87 వేలు విడుదల చేశారన్నారు. 30వ తేదీ ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభమై సాయంత్రం వరకూ కొనసాగుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటూ ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది ద్వారా ఇంటింటికీ పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో 1283 మంది పెన్షన్‌లు తీసుకోలేదని, వీరికి రెండు నెలల మొత్తం కలిపి 30వ తేదీ అందిస్తారన్నారు.

శనగ పంటలో విత్తనశుద్ధి చేసుకోవాలి



చీమకుర్తి : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో భాస్కర్



రాచవారిపాలెంలో సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో రమేష్

మద్దిపాడు: రైతులు శనగ పంటలో విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయ అధికారి జీ రమేష్ సూచించారు. బుధవారం మండలంలోని రాచవారిపాలెం, కీర్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తోందని తెలిపారు. మండలంలో శనగ పంట వేసే రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుని రైతు కట్టాల్సిన నగదు జమచేసుకుంటే విత్తనాలు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. రైతులు విత్తనశుద్ధిని ట్రైకోడెర్మావిరిడీని ఒక కేజీ విత్తనానికి 8 గ్రాముల చొప్పున వాడి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. తద్వారా తెగులును నివారించవచ్చని తెలిపారు. విత్తనశుద్ధి చేసే రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిస్తే ట్రైకోడెర్మావిరిడీ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రాచవారిపాలెంలో సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ చాందిని, రాచవారిపాలెం, కీర్తిపాడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: ప్రతి పంట సాగులోనూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి డీవీ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని మంచికలపాడు, పడమటి నాయుడుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రైతు భరోసా కేంద్రంలో ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేడు మద్దిపాడు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు ఫీడర్లో కొత్త వీసీబీ ఏర్పాటు, మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. బసవన్నపాలెం, నందిపాడు, ఇనమనమెళ్లూరు, సీతారాంపురం, దొడ్డవరపాడు, పెద్దకొత్తపల్లి, నేలటూరు, గురవారెడ్డిపాలెం, మారెళ్లకుంటపాలెం, నర్సాయపాలెం, మద్దిపాడు, వెల్లంపల్లి, కొలచనకోట, గుండ్లాపల్లి, బూరేపల్లి, నాగన్నపాలెం, రాచవారిపాలెం, గార్లపాడు, ఘడియపూడి, గాజులపాలెం, కీర్తిపాడు, సంతనూతలపాడు మండలంలోని రుద్రవరం గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు.